# బంగారంపై పెట్టుబడులా?

## అధిక ధరల నేపథ్యంలో నిపుణుల సూచనలివీ..

**మార్కెట్‌లో** బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. మునుపెన్నడూలేని రికార్డు స్థాయిల్లో కదలాడుతున్నాయి. ఈ క్రమంలో మదుపరులు సైతం పుత్తడిపై పెట్టుబడులకు అమితాసక్తిని ప్రదర్శిస్తున్నారు. అయితే మార్కెట్ విశ్లేషకులు మాత్రం అతిగా స్పందించడం తొందరపాటేనంటున్నారు. రాబోయే నెలల్లో ఒకేసారి పెద్ద ఎత్తున పెట్టుబడులకు దూరంగా ఉండాలని సలహా ఇస్తున్నారు.




**ఎందుకిలా?**

ప్రస్తుతం పసిడి ధరలు ఆల్‌టైమ్ హై స్థాయి దరిదాపుల్లో ఉన్నాయి. దీంతో మున్ముందు ఈ ధరల్లో దిద్దుబాటుకు అవకాశాలున్నాయని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే జరిగితే అధిక ధరల వద్ద పెట్టుబడులు పెట్టిన మదుపరులకు నష్టాలు తప్పవు. అందుకే గోల్డ్ పోర్ట్‌ఫోలియో పరిమాణాన్ని ఇన్వెస్టర్లు తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. దీర్ఘకాలంలో గోల్డ్ మార్కెట్ బుల్లీష్‌గానే ఉండే వీలున్నా.. షార్ట్-టర్మ్‌లో ఒడిదొడుకులకు ఆస్కారం ఉందని అంటున్నారు. దీనివల్ల ఒక రకమైన అయోమయం ఇన్వెస్టర్లలో నెలకొనవచ్చని, ఇది ఆకస్మిక క్రయవిక్రయాలకు దారితీయవచ్చని, అదంత మంచి పరిణామం కాదని వారు పేర్కొంటున్నారు.

**భారీగా వద్దు..**

బంగారంపై పెట్టుబడులు పెట్టాలనుకొనే వారు తమ దగ్గరున్న మొత్తం నగదు నిల్వలను అందుకే వినియోగించవద్దని, కొద్ది మొత్తాలతోనే సదరు ఇన్వెస్ట్‌మెంట్లకు దిగాలని ఎక్స్‌పర్ట్స్ సలహా ఇస్తున్నారు. దేశీయంగా గడిచిన నెల రోజుల్లో గోల్డ్ రేట్లు డాలర్ల రూపేణా 6.3 శాతం, రూపాయల్లో 7.1 శాతం ఎగిశాయి. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 0.7 శాతం పడిపోయింది. ఇక గత ఏడాదితో పోల్చితే ఇప్పుడున్న బంగారం ధర డాలర్లలో 21.2 శాతం, రూపాయల్లో 28.8 శాతం ఎక్కువ. ఇక నిఫ్టీ 15.3 శాతం పెరిగింది. దీన్ని చూసి చాలామంది స్టాక్ మార్కెట్లలో మదుపు కంటే బంగారంపై పెట్టుబడులే ఉత్తమమని భావిస్తున్నారు. అందుకే ఇటీవలికాలంలో గోల్డ్‌పై ఇన్వెస్ట్‌మెంట్స్ క్రమేణా పెరిగిపోతున్నాయి.

**7 శాతం డౌన్?**

వచ్చే 3-4 నెలల్లో బంగారం ధరలు 5 నుంచి 7 శాతం మేరకు పడిపోవచ్చని, అందుకే అతిగా పెట్టుబడులు మానుకోవడమే మంచిదన్న అభిప్రాయాన్ని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో బులియన్ అనలిస్ట్ మానవ్ మోదీ చెప్తున్నారు. ఈ క్రమంలోనే రాబోయే 3-6 నెలల్లో పసిడిపై పెట్టుబడులను సందర్భానుసారం పెడుతూపోవాలని సూచిస్తున్నారు. అయితే వచ్చే రెండేండ్లలో తులం ధర 86వేల మార్కును తాకవచ్చనీ మోదీ అంచనా వేస్తున్నారు. మరోవైపు అమెరికా ఎన్నికల దృష్ట్యా ఈక్విటీ మార్కెట్లు మరింత ఆటుపోట్లకు లోను కావచ్చని కనుక పసిడిపై పెట్టుబడులు పెద్దగా నష్టాల్ని తెచ్చిపెట్టకపోవచ్చని నిప్పాన్ ఇండియా మ్యూచువల్ ఫండ్‌లో ఫండ్ మేనేజర్, కమోడిటీస్ విభాగం అధిపతి విక్రమ్ ధావన్ అంటున్నారు. అయితే స్వల్పకాలంలో ధరల్లో హెచ్చుతగ్గులు బాగా ఉంటాయని, ఈ పరిస్థితులను అధిగమిస్తే అంతా ఓకేనన్న అభిప్రాయాన్ని కనబరుస్తున్నారు. ఇక అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు, భౌగోళిక-రాజకీయ అనిశ్చిత పరిస్థితులూ బంగారం ధరలను ఎగదోయవచ్చన్న అంచనాలున్నాయి.






## పీపీఎఫ్‌తో కరోడ్‌పతి

**పబ్లిక్** ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)లో నిర్దిష్ట రీతిలో పెట్టుబడులు పెట్టి, పూర్తి కాల వ్యవధి ఆగితే కోటి రూపాయలకుపైగానే అందుకోవచ్చు. పీపీఎఫ్.. కేంద్ర ప్రభుత్వం అందించే పథకం కావడంతో ఇదో సురక్షిత పెట్టుబడి. ముఖ్యంగా పదవీ విరమణ తర్వాత ఆనందదాయక జీవితాన్ని ఆస్వాదించేందుకు ఇది చక్కని మార్గం కూడా. పిల్లల చదువు, వివాహాలు తదితర లక్ష్యాల సాధనకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇక దీనిపై ఈ అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను 7.1 శాతం వడ్డీరేటున్నది. దీన్నిబట్టి ఈ పథకంలో గరిష్ఠ స్థాయి పెట్టుబడులు పెడితే కాలపరిమితి తీరాక కోటీశ్వరులమే.

**ఇదీ లెక్క**

పీపీఎఫ్ ఖాతా మెచ్యూరిటీ 15 ఏండ్లు. ఇందులో ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షల పెట్టుబడి పెడితే 15 ఏండ్లకు రూ.22.5 లక్షలు అవుతుంది. దీనికి 7.1 శాతం వడ్డీ ప్రయోజనాన్ని జతచేస్తే ఆ మొత్తం రూ.40,68,209 అవుతుంది. వడ్డీ వాటానే రూ.18,18,209. ఇక మీ పీపీఎఫ్ ఖాతాను నిర్ణీత కాలపరిమితి తీరాక ఐదేండ్ల చొప్పున రెండుసార్లు అంటే 10 సంవత్సరాలు పొడిగించుకుంటే మొత్తం 25 ఏండ్ల తర్వాత మీరు పెట్టిన పెట్టుబడి రూ.1,03,08,014.97 అవుతుంది. ఒకవేళ మరో ఐదేండ్లు దీన్ని ఆపితే అది రూ.1,54,50,910.59కి చేరుతుంది. కాగా, పీపీఎఫ్ ఖాతాలో ఒక ఆర్థిక సంవత్సరానికి కనిష్ఠంగా రూ.500, గరిష్ఠంగా రూ.1.5 లక్షలు డిపాజిట్ చేసుకోవచ్చు. రూ.50కి తగ్గకుండా ఎన్నిసార్లైనా డిపాజిట్లు చేయవచ్చు. డిపాజిట్లకు ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ప్రయోజనాలుంటాయి. అలాగే వడ్డీ ఆదాయానికీ పన్ను మినహాయింపులు వర్తిస్తాయి.

# సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు తెలుసా!

**మీరెక్కడా** ఇప్పటిదాకా రుణాలు తీసుకోకుంటే మీకు రుణ చరిత్రే ఉండదు, రుణ ఎగవేతలున్నా క్రెడిట్ స్కోర్ బాగుండదు.. అప్పుడు మీ క్రెడిట్ కార్డ్ దరఖాస్తు తప్పకుండా తిరస్కరణకు గురవుతుంది. అలాంటివారి ఆర్థిక అవసరాలకు సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు సరిపోతాయి. రుణ చరిత్ర, క్రెడిట్ స్కోర్లతో సంబంధం లేకుండా బ్యాంకులు ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను జారీ చేస్తాయి మరి.

**సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు అంటే?**

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను నగదు పూచీకత్తుపైనే జారీ చేస్తారు. క్రెడిట్ కార్డు బకాయిల చెల్లింపుల్లో ఎగవేతలకు ఆస్కారమున్నప్పుడు బ్యాంకర్లు తమ రక్షణార్థం వీటిని కస్టమర్లకు ఇస్తారు. దీనివల్ల కస్టమర్లు క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించలేకపోయినా బ్యాంకులకు నష్టం వాటిల్లదు. కార్డు కోసం పూచీకత్తుగా పెట్టిన నగదును ఆ బకాయిల కింద జమ చేసుకుంటారు. కార్డు పరిమితి రూ.50,000 కావాలనుకుంటే, అంతే మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. రూ.3 లక్షలు లేదా రూ.5 లక్షలు కావాలన్నా.. అంతే మొత్తాలు డిపాజిట్ చేయాలి. మీరు చేసే డిపాజిట్లనుబట్టే మీరు పొందే క్రెడిట్ కార్డుకున్న రుణ పరిమితులు ఆధారపడి ఉంటాయి.



- విద్యార్థులు, అప్పుడప్పుడే సంపాదనలో పడ్డవారికి ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను ఎక్కువగా బ్యాంకింగ్ సంస్థలు సూచిస్తాయి. అలాగే ఇటీవలికాలంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను చవిచూసినవారు.. క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా వారి క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటుంది గనుక ఇవే వస్తాయి.
- రుణ చరిత్ర లేనివారికి ఈ కార్డుతో క్రెడిట్ స్కోర్ ఏర్పడుతుంది. సక్రమ లావాదేవీలతో క్రెడిట్ స్కోర్‌ను క్రమేణా పెంచుకోవచ్చు.
- ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు.. రెగ్యులర్ క్రెడిట్ కార్డు మాదిరే ఉంటుంది. చెల్లింపులు, వడ్డీలు, జరిమానాల్లో ఏ తేడాలు ఉండవు.
- తొలుత తీసుకున్న సెక్యూర్డ్ క్రెడిట్ కార్డును క్రమశిక్షణతో వినియోగిస్తే క్రెడిట్ స్కోర్ పెరుగుతుంది. దాని ఆధారంగా రెగ్యులర్ అన్‌సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను పొందవచ్చు.

## సంపద సృష్టికి పంచ సూత్రాలు

**ధనవంతులు** కావాలని మనలో ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. అయితే అందుకు కావాల్సిన ప్రణాళికల్లోనే తడబడుతారు. కానీ ఈ ఐదు సూత్రాలను పాటిస్తే సంపద మీ వెంటే. వాటిలో.. లక్ష్యం, బడ్జెట్, పెట్టుబడి, బీమా, అత్యవసర నిధి ఉన్నాయి.

**లక్ష్యం:** లక్ష్యం లేని ప్రయత్నం వృథా. అందుకే ఓ లక్ష్యాన్ని పెట్టుకుని ముందుకెళ్తే విజయాన్ని సాధించవచ్చు.

**బడ్జెట్:** ఖర్చులను అదుపులో ఉంచుకున్నప్పుడే ఆర్థిక లక్ష్యాల సాధనకు ఆస్కారం ఉంటుంది.

**పెట్టుబడి:** పెట్టుబడులు కూడా ప్రధానమే. సరైన ఆర్థిక సాధనాలను ఎంచుకొని పెట్టుబడులు పెడితే సంపద వృద్ధికి అవి దోహదం చేయగలవు.

**బీమా:** బీమా కూడా చాలా అవసరమైనదే. జీవిత, ఆరోగ్య బీమాలను తక్కువగా అంచనా వేయవద్దు.

**అత్యవసర నిధి:** రోజులు ఎలా ఉంటాయో? ఎవరికీ తెలియదు. అందు కే కనీసం 6 నెలల పాటు ఆదాయం లేకున్నా జీవించేలా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి.

# ఆర్థిక ఫలితాలపై ఆధారం

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో తీవ్ర ఒడిదొడుకులు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నడుమ మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 307.09 పాయింట్లు దిగజారి 81,381.36 వద్ద ముగిసింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 50.35 పాయింట్లు కోల్పోయి 24,964.25 దగ్గర స్థిరపడింది. దీంతో ఈ వారం కూడా సెల్లింగ్ ప్రెషర్ కొనసాగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను ఆయా కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు మార్కెట్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆయిల్, ఎఫ్ఎంసీజీ షేర్లు ఆటుపోట్లకు గురికావచ్చు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, విదేశీ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,300-25,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




**గమనిక..**

*స్టాక్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*

